క్లుప్తంగా

జీవ ఇంధనమే భవిష్యత్ తరాలకు ప్రత్యామ్నాయం



ఏఎన్‌యూ: బయో ఇంధనమే భవిష్యత్ తరాలకు ప్రత్యామ్నాయమని, గ్రీన్ ఎనర్జీపై అందరికీ అవగాహన ఉండాలని ఐఐఎం నాగపూర్‌కు చెందిన ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ గ్రీన్ ఎనర్జీ వ్యవస్థాపకుడు వైభవ్ డాంగే పేర్కొన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో సోమవారం భారత ఆర్థిక వ్యవస్థలో బయో ఫ్యూయల్, గ్రీన్ ఎనర్జీ ప్రభావంపై జరిగిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థపై వీటి ప్రభావం ఎలా ఉంటున్నదనే అంశాలపై చర్చించారు. కామర్స్, వ్యాపార నిర్వహణ శాస్త్ర పీఠాధిపతి ఆచార్య రామినేని శివరామ్ ప్రసాద్ సదస్సుకు సభాధ్యక్షత వహించారు. ఏఎన్‌యూ ప్రవేశాల విభాగం సంచాలకులు ఆచార్య పి.బ్రహ్మజీ మాట్లాడారు. సదస్సులో యూనివర్సిటీ వీసీ కంచర్ల గంగాధరరావు, రెక్టార్ కె.రత్నషీలామణి, ఆర్ట్స్, కామర్స్, లా కళాశాలల ప్రిన్సిపాల్స్ కె.వీరయ్య, రామినేని శివరామ్ ప్రసాద్, ఎం.సుబ్బారావు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో శునకాల పట్టివేత

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో శునకాల బెడద నుంచి రోగుల, వారి సహాయకులను, సిబ్బందిని కాపాడేందుకు సోమవారం ఆస్పత్రిలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఆదివారం ఆసుపత్రిలో శునకాల దాడిలో పలువురు రోగుల సహాయకులు గాయపడ్డారంటూ సోషల్ మీడియాలో వీడియో వైరల్ అయింది. ఈనేపథ్యంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ మున్సిపల్ అధికారులతో మాట్లాడి మున్సిపల్ సిబ్బంది సహకారంతో జీజీహెచ్‌లో కుక్కలను పట్టి తరలించారు.

శ్రీరాములు త్యాగాలు మరువలేనివి

గుంటూరు మెడికల్: ఏపీ ఎన్జీవో సంఘం బలోపేతం చేసిన వ్యక్తుల్లో ఆమనగంటి శ్రీరాములు ఎంతో ముఖ్యులని, ఆయన త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు అన్నారు. సోమవారం గుంటూరులోని ఏపీ ఎన్జీవో కార్యాలయంలో శ్రీరాములు జయంతి సభ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో నగర అధ్యక్షుడు సూరి, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నాగరాజు, శ్యామ్‌సుందర శ్రీనివాస్, సుకుమార్, అనిల్‌కుమార్, సయ్యద్ జానీ బాషా, రాధారాణి, అంకమ్మరావు, పద్మజ, శైలజ, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో ఉమెన్స్ డే వేడుకలు



గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నర్సుల సంఘం గుంటూరు శాఖ ఆధ్వర్యంలో సోమవారం గుంటూరు జీజీహెచ్‌లో ఉమెన్స్ డే వేడుకలు నిర్వహించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ ముఖ్య అతిథిగా విచ్చేసి మహిళలు చేస్తున్న సేవల గురించి కొనియాడారు. పలువురు నర్సింగ్ సిబ్బందికి మెమోంటోలు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో నర్సుల సంఘం అధ్యక్షురాలు కోటమ్మ, సెక్రటరీ పద్మజ, నేతలు సునీత, హేమలత, ఆషాలత, శ్రీదేవి, గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్ గంగమ్మ, గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్ ఆవుల విజయ పాల్గొన్నారు.

మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ

గుంటూరు మెడికల్: ప్రతి మహిళ తమ కాళ్లపై నిలబడేందుకు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు మహిళలకు ఉచిత టైలరింగ్, మగ్గం వర్క్ నేర్పిస్తున్నట్లు సర్వీస్ విత్ లవ్ స్వచ్ఛంద సేవాసంస్థ చైర్‌పర్సన్ వేళంగిని బాబూరావు తెలిపారు. స్థానిక కొండ వెంకటప్పకాలనీలో సోమవారం ఉచిత టైలరింగ్ సెంటర్‌ను ప్రారంభించారు.

పికిల్ బాల్ విజేత నేహా



గుంటూరు వెస్ట్(క్రీడలు): వీవీవీ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులో నిర్వహించిన అండర్-14 పికిల్ బాల్ పోటీల్లో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చిన్నారి నేహా విజేతగా నిలిచిందని, రన్నర్‌గా కళ్యాణ్ నిలిచాడని కోచ్ జీవీఎస్ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-12 విభాగంలో నెక్స్ట్ జెన్ స్కూల్ చిన్నారి విభా విజేతగా నిలవగా టాప్ కిడ్స్ స్కూల్ చిన్నారి నేహా రన్నర్‌గా నిలిచిందన్నారు. అనంతరం విజేతలకు వీవీవీ హెల్త్ క్లబ్ డైరెక్టర్ హరికృష్ణ, న్యాయవాది చిగురుపాటి రవీంద్ర బాబు బహుమతులు అందజేశారని తెలిపారు.

బ్రెయిన్ జర భద్రం...

- మెదడు ట్యూమర్లకు ఆధునిక చికిత్స
- జీజీహెచ్‌లో అందుబాటులో వైద్యం
- ఈనెల 17వ వరకు అవగాహన వారం



గుంటూరు మెడికల్: ఏదైనా తప్పు చేసినప్పుడు నీకు మెదడు ఉందా, చిన్నమెదడేమైనా చితికిందా ... అంటూ ప్రశ్నించడం మనం వింటూనే ఉంటాం . మనిషి చేసే తప్పు ఒప్పులు మెదడు ఆలోచనపై ఆధారపడి ఉంటాయి. మనిషి దైనందిన జీవితంలో చేసే పనులన్నీ కూడా బ్రెయిన్ ద్వారానే జరుగుతాయి. జ్ఞానేంద్రియాలకు ఇది ముఖ్యమైన కేంద్రం . మెదడును పరిరక్షించుకోకపోతే ఎలాంటి అనర్థాలు వస్తాయి. మెదడు గురించి అవగాహన కల్పించేందుకు 1996 నుంచి 120 దేశాల్లో ప్రతి ఏడాది మార్చి 10 నుంచి 17వ తేదీ వరకు బ్రెయిన్ అవేర్‌నెస్ వీక్ నిర్వహిస్తున్నారు.

మెదడు ఎదుగుదల..

18 ఏళ్ల వయస్సు వచ్చే వరకు బ్రెయిన్ ఎదుగుతూ ఉంటుంది. పగలు కంటే రాత్రి వేళల్లోనే మెదడు ఎక్కువ యాక్టివ్‌గా పనిచేస్తుంది. శరీరం మొత్తం వినియోగించుకునే శక్తిలో20 శాతాన్ని మెదడు వినియోగించుకుంటుంది. 80 శాతం నీరు ఉండి, 1300 నుంచి 1400 గ్రాముల బరువు కలిగి ఉంటుంది.

మెదడుకు ఇబ్బందికర పరిస్థితులు....

ప్రమాదాల్లో తలకు గాయాలవ్వటం, పక్షవాతం, మెదడులో ట్యూమర్లు ఏర్పడడం, పార్కిన్‌సన్స్ వ్యాధి, డిప్రెషన్ కారణాల వలన మెదడు దెబ్బతింటుంది. తలనొప్పి, వాంతులు అవడం, చూపులో తేడాలు, నడకలో తడబాటు, జ్ఞాపకశక్తి లోపించడం, ఏదైనా విషయాలపై ఏకాగ్రత చూపించలేకపోవడం, చెవిలో శబ్దాలు వినిపించడం, మనిషి అసాధారణంగా ప్రవర్తించడం లాంటి లక్షణాలు కనిపిస్తే మెదడుకు ఇబ్బందికరమైన పరిస్థితులు తలెత్తాయనే విషయం గుర్తించాలి.

ట్యూమర్స్‌పై అప్రమత్తంగా ఉండాలి....

మెదడులో ఏర్పడే కొన్ని గడ్డలు క్యాన్సర్‌గా మారి ప్రాణాలు తీస్తాయి. ఆపరేషన్ చేసి తొలగించవచ్చు. బ్రెయిన్ ట్యూమర్ ఉన్నవారిలో ఫిట్స్ వస్తాయి. వైద్యుల సలహా మేరకు ఫిట్స్ రాకుండా మందులు వాడుతూ ఉండాలి. చేతులు, కాళ్లు పని చేయకపోతే పక్షవాతం అని భావిస్తారు. బ్రెయిన్‌లో గడ్డ ఉండటం వలన కూడా ఇలా జరగవచ్చు. అన్ని వయస్సుల వారికి బ్రెయిన్ ట్యూమర్‌లు వస్తాయి. సీటీస్కాన్, ఎంఆర్‌ఐ స్కానింగ్ ద్వారా బ్రెయిన్ ట్యూమర్‌లను నిర్ధారిస్తారు.

బాధితుల వివరాలు...

గుంటూరు జీజీహెచ్‌లో రోడ్డు ప్రమాదాల వలన తలకు గాయాలైన వారు, తలలో వివిధ రకాల గడ్డలు వచ్చిన వారు ప్రతిరోజూ వంద మంది వరకు చికిత్స కోసం వస్తున్నారు. న్యూరాలజీ ఓపీ వైద్య విభాగంలో ప్రతిరోజూ 200 మంది వివిధ రకాల మెదడు సంబంధిత సమస్యలతో చికిత్స కోసం వస్తున్నారు. జిల్లాలో 50 మంది న్యూరాలజిస్టులు, న్యూరోసర్జన్లు ఉన్నారు. వీరి వద్దకు ప్రతిరోజూ 20 నుంచి 30 మంది వివిధ రకాల మెదడు సంబంధిత సమస్యలతో చికిత్స కోసం వస్తున్నారు.

అందుబాటులో ఆధునిక వైద్యసేవలు



న్యూరో నేవిగేషన్, ఆల్ట్రా మైక్రోస్కోప్ లాంటి ఆధునిక ఆపరేషన్లతో బ్రెయిన్ ట్యూమర్ ఆపరేషన్ చేయించుకున్న వారు గతంలో కంటే చాలా మెరుగైన జీవితాన్ని గడపవచ్చు. ఈ ఆధునిక వైద్యం ద్వారా నూటికి 90శాతం రోగికి మంచి జీవితాన్ని ప్రసాదించవచ్చు. బ్రెయిన్ ట్యూమర్స్‌లో నూటికి 10 శాతం మాత్రమే ప్రాణాంతకమైనవి. గడ్డలను నయం చేయవచ్చు.

– డాక్టర్ భవనం హనుమశ్రీనివాసరెడ్డి, న్యూరోసర్జన్, గుంటూరు

మెదడును జాగ్రత్తగా కాపాడుకోవాలి



వయస్సు పెరిగే కొద్ది మెదుడు రక్తనాళాలు పగిలి ప్రాణాంతకం అయ్యే ప్రమాదం ఉంది. న్యూరాలజీ, న్యూరోసర్జన్స్‌ను సంప్రదించి మెదడు పనితీరు గురించి తెలుసుకోవాలి. ఒత్తిడికి గురి కాకూడదు. నిత్యం యోగా, ధ్యానం, శారీరక వ్యాయామాలు చేయాలి. చేపలు, గుడ్లు, తాజా పండ్లు తీసుకోవాలి. మెదడు నిరంతరం పదునుగా పనిచేసేలా ఫజిల్స్ చేయటం, నూతన విషయాలు నేర్చుకోవటం చేయాలి.

– డాక్టర్ పమిడిముక్కల విజయ, సీనియర్ న్యూరాలజిస్ట్, గుంటూరు

'యువత పోరు'ను జయప్రదం చేయాలి



యువత పోరు పోస్టర్ ఆవిష్కరిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షురాలు నూరిఫాతిమా

వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షురాలు షేక్ నూరి ఫాతిమా

నెహ్రూనగర్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే 'యువత పోరు'లో యువత, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొని జయప్రదం చేయాలని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, గుంటూరు తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా పేర్కొన్నారు. సోమవారం మంగళదాస్‌నగర్‌లోని తూర్పు నియోజకవర్గ కార్యాలయంలో యువత పోరుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యార్థులకు, రైతులకు, మహిళలు తదితర వర్గాలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఎన్నికల ముందు సాధ్యం కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు నేటి వాటిని అమలు చేయడం లేదన్నారు. టీడీపీ అంటేనే బూటకపు పార్టీ అని, అబద్ధాల పార్టీ అని మరోసారి తేటతెల్లం అయిందని పేర్కొన్నారు. ఆనాడు పేద విద్యార్థులు చదువుకునేందుకు వీలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్, విదేశీ విద్య కార్యక్రమాలు చేపడితే.. గత వైఎస్ జగన్ పాలనలో నాడు నేడు, విద్యా దీవెన, వసతి దీవెన వంటి కార్యక్రమాలను అమలు చేసి విప్లవాత్మకమైన విద్యవ్యవస్థలో మార్పులు తీసుకువచ్చారన్నారు. ఒక్క విద్యాదీవెన, వసతి దీవెన కింది రూ.18 వేల కోట్లు ఖర్చు చేశారని పేర్కొన్నారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఏ ఒక్క పథకాన్ని అమలు చేయలేదని ఆగ్రహించారు. రాష్ట్రంలో విద్యను నిర్వీర్యం చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో జగన్ హయాంలో మెడికల్ కాలేజీలు తీసుకొస్తే.. నేడు చంద్రబాబు నాయుడు వాటి ప్రైవేటీకరణకు కుయుక్తులు పన్నుతున్నారని విమర్శించారు. దీని వలన లక్షలాది మంది విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని పేద విద్యార్థుల శ్రేయస్సు కోసం వైఎస్సార్‌సీపీ నడుం బిగించిందన్నారు. కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేలా పోరుకు సిద్ధం అయిందన్నారు. ఈ నెల 12వ తేదీన జరిగే యువత పోరును ప్రతి ఒక్కరూ జయప్రదం చేయాలని కోరారు. కూటమి ప్రభు త్వ అరాచాకాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలే సేవలు మరువలేనివి

ఏఎన్‌యూ: సావిత్రీబాయి పూలే వర్ధంతి సందర్భంగా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ లో పూలే అధ్యయన కేంద్రం డైరెక్టర్ ఆచార్య ఎం.త్రిమూర్తిరావు, యూనివర్సిటీ అధికారులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. డైరెక్టర్ ఆచార్య ఎం.త్రిమూర్తి రావు మాట్లాడుతూ సావిత్రీబాయి పూలే భారతదేశ మొదటి మహిళా ఉపాధ్యాయురాలని, ప్రధానోపాధ్యాయురాలుగా విధులు నిర్వహించారన్నారు. ఆమె సామాజిక సంఘసంస్కర్తగా, నిమ్న వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని పేర్కొన్నారు. కులమతాలకతీతంగా సమాజాభివృద్ధికి కృషి చేశారన్నారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం .సురేష్ కుమార్ మాట్లాడుతూ సావిత్రీబాయి పూలే మహిళల హక్కుల కోసం పోరాడిన తొలితరం మహిళా ఉపాధ్యాయురాలు అని కొనియాడారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.వీరయ్య మాట్లాడుతూ పూలే దంపతులు జాతి వివక్షతను స్త్రీ అణిచివేతను వ్యతిరేకించి సమాజంలో సమానత్వం కోసం నిరంతరం కృషి చేశారని, వారి త్యాగాలు చిరస్మరణీయమన్నారు. ఆచార్య జి.వి.రమణ, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.ప్రమీలారాణి, అంబేడ్కర్ చైర్ డైరెక్టర్ ఆచార్య అశోక్ కుమార్, జగ్జీవన్ రామ్ చైర్ డైరెక్టర్ పి.జె.రత్నాకర్, ఉమెన్స్ స్టడీస్ డైరెక్టర్ ఇ.వి.పద్మజ మాట్లాడారు. కార్యక్రమంలో పూలే అధ్యయన కేంద్రం ప్రోగ్రామర్ బి.కోటి యాదవ్, బీసీ ఉద్యోగ సంఘం నాయకులు సి.హెచ్.సాంబశివరావు, ఇ.సాయిరాం, పద్మ, శాంతి శ్రీ, జగ్జీవన్ రామ్ చైర్ ప్రోగ్రామర్ ఎన్. అశోక్, ఏపీ స్టూడెంట్స్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హేమాద్రి, వెంకటేష్, బీసీఎస్‌ఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు రామకృష్ణ, మహేష్, పరిశోధకులు టి.శివరాం, అభిషేక్, గంగాధర్ బ్రహ్మం పాల్గొన్నారు.



ఏఎన్‌యూలో పూలే చిత్రపటం వద్ద నివాళి

నెహ్రూనగర్: సావిత్రీబాయి పూలే చిరస్మరణీయురాలని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ పేర్కొన్నారు. సావిత్రీబాయి పూలే వర్ధంతి సందర్భంగా సోమవారం ఉదయం వీసీకే పార్టీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు కె.జయసుధ ఆధ్వర్యంలో అరండల్ పేటలో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షులు కొరివి వినయ కుమార్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల వారికి చదువు నేర్పించడంలో సావిత్రిభాయి పూలే కృషి ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో హైకోర్టు అడ్వకేట్ వై.కోటేశ్వరరావు(వైకే), బీసీ నాయకులు పి.వి.రమణయ్య, సుబ్రహ్మణ్యం, ఆర్టీఐ యాక్టివిస్ట్ ప్రశాంతి, రాయపూడి మరియదాస్, కట్టా రాజు, బెజవాడ సాంబయ్య, మద్దు రత్న సుందరరాజు, డెన్నిస్ రాయ్, ప్రేమ్, ఆర్.పి.ఐ. నాయకులు వై.లక్ష్మీనారాయణ, మస్తాన్ రెడ్డి, బత్తుల కోటేశ్వరరావు పాల్గొన్నారు. భారతీయ సంఘ సంస్కర్త, ఉపాధ్యాయుని, రచయిత్రి సావిత్రిభాయి పూలే నేటి సమాజానికి ఎంతో ఆదర్శమని స్వర్ణాంధ్ర ఎమ్మార్పీస్ అధ్యక్షులు ఏసుబాబు పేర్కొన్నారు. కాకాని రోడ్డులోని సంఘ కార్యాలయంలో సావిత్రీ బాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

యూనియన్ బ్యాంక్‌లో ఉమెన్స్ డే వేడుకలు



కొరిటెపాడు: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గుంటూరు ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో ఐటీఏ కళ్యాణ మండపంలో సోమవారం అంతర్జాతీయ మహిళ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళా సాధికారత కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మహిళలు అభివృద్ధి చెందితేనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. యూబీఐ మహిళ ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. మహిళా పారిశ్రామిక వేత్తలకు రూ.150 కోట్ల రుణాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్యాంక్ రీజనల్ హెడ్ ఎస్.జవహర్, డాక్టర్ ఆర్. శారద లక్ష్మీదేవి పాల్గొన్నారు.

సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి

గుంటూరు ఎడ్యుకేషన్: జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేందుకు ఎల్లప్పుడూ సంసిద్ధంగా ఉండాలని, అప్పుడే ఉన్నత విజయాలు సాధించగలమని ప్రముఖ వైద్య నిపుణుడు జి.కళ్యాణ్ చక్రవర్తి అన్నారు. భాష్యం ఐఐటీ ఫౌండేషన్ అకాడమీ ఆధ్వర్యంలో గోరంట్లలోని భాష్యం రామసేతు క్యాంపస్‌లో సోమవారం స్ప్రింగ్ ఫెస్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ ఉన్నత లక్ష్యాన్ని సాధించే క్రమంలో ఒత్తిడి సహజమని, ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ, ప్రణాళికాబద్ధంగా దినచర్యను రూపొందించుకుంటే దీనిని అధిగమించవచ్చన్నారు. ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ పద్మజ మాట్లాడుతూ విద్యార్థి జీవితం ఎంతో విలువైనదని, స్మార్ట్‌ఫోన్లు, సామాజిక మాధ్యమాలకు బానిసలు కాకుండా చదువుపై దృష్టి సారించాలని సూచించారు. భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి భాష్యం విద్యా సంస్థలు కృషి చేస్తున్నాయని అన్నారు. చదువు ఒక్కటే కాకుండా విద్యార్థులకు ఆసక్తి గల ఆయా రంగాల్లో ప్రోత్సహిస్తూ ఒత్తిడి లేని విద్యా విధానానికి నాంది పలికామన్నారు. తొలుత అతిథుల చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతుల్ని అలరించాయి. కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, పక్కన భాష్యం రామకృష్ణ

స్టాండింగ్ కమిటీ సమావేశానికి కసరత్తు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ సమావేశం ఈ నెల 17వ తేదీ నిర్వహించనున్న నేపథ్యంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, పనులు నిర్వహించేందుకు ప్రియాంబుల్స్ ఈ నెల 11వ తేదీ లోగా కౌన్సిల్ సెక్రటరీకి అందజేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. కమిషనర్ ఛాంబర్‌లో స్టాండింగ్ కమిటీ సమావేశం ఏర్పాటు కోసం విభాగాధిపతులతో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ముఖ్యంగా స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి ముఖ్యమైన అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించేందుకు మంగళవారం సాయంత్రంలోపు ప్రియాంబుల్స్‌ను కౌన్సిల్ సెక్రటరీకి అందజేయాలన్నారు. సదరు సమావేశానికి సంబంధించి ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించినవి మాత్రమే కాకుండా ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక విభాగాలకు సంబంధించిన ప్రియాంబుల్స్ ఉంటే అందజేయలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సి.హెచ్.శ్రీనివాసరావు, టి.వెంకటకృష్ణయ్య, సెక్రటరీ పి.శ్రీనివాసరావు, ఎంహెచ్ఓ రవిబాబు, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, ఈఈ లు సుందర్రామిరెడ్డి, కోటేశ్వరరావు, ఏడీహెచ్ శ్రీనివాసరావు, వెటర్నరీ సివిల్ సర్జన్ వెంకటేశ్వరరావు, పీఓ రామారావు, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: హ్యాపెన్ మైగ్రింట్స్ గుంటూరు సంస్థ ఆధ్వర్యంలో సోమవారం తుళ్లూరు మండలం ఐనవోలులో కె.ఎం.వి.ప్రాజెక్టు ప్రైవేటు లిమిటెడ్ కన్‌స్ట్రక్షన్‌లో వలస కూలీలకు హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. హెచ్ఐవీ నిర్ధారణ పరీక్షలు, షుగర్, బీపీ పరీక్షలు, మెడెక్స్ హాస్పటల్ సౌజన్యంతో కంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ టి.శ్రీనివాసరావు, డాక్టర్ సి.హెచ్.మౌర్యసాయికుమార్, ఏఎన్‌ఎం సి.హెచ్.అమ్మాజీ, పి.కోటేశ్వరరావు. బి.భావన్నారాయణ పాల్గొన్నారు.

హోంగార్డుకి నగదు బహుమతి



నగరంపాలెం: భవిష్యత్‌లో మరెన్నో పతకాలు సాధించాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. ఈనెల 4 నుంచి 9 వరకు బెంగళూరులో జరిగిన జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఐదు కిలోమీటర్ల నడక పోటీల్లో హోంగార్డు ఎ.కృష్ణకిషోర్ రెండో స్థానంలో నిలిచాడు. ఈ మేరకు అతన్ని సోమవారం డీపీఓలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అభినందించి, పది వేలు నగదు అందించారు.

- గత నెలలో పదవి విరమణ పొందిన హోం గార్డు చిన్న సుబ్బారావుకి జిల్లాలోని హోంగార్డుల ఒక రోజు వేతనం రూ.2.27 లక్షల చెక్కుని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అందించారు. ఏఆర్ డీఎస్పీ ఏడుకొండలు రెడ్డి, వెల్ఫేర్, హోంగార్డ్ ఆర్ఐ శివరామకృష్ణ, హోంగార్డు ఎస్సీఓ హెడ్ కానిస్టేబుల్ కరిముల్లా పాల్గొన్నారు.

నూతన పంచాంగం ఆవిష్కరణ



నగరంపాలెం: గుంటూరు పట్టణ ఫ్యాన్సీ స్టేషనరీ జనరల్ మర్చంట్ అసోసియేషన్ ముద్రించిన శ్రీవిశ్వ వసునామ సంవత్సర నూతన పంచాంగాన్ని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సోమవారం బృందావన్‌గార్డెన్స్‌లోని ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఎనిమిదేళ్లుగా పంచాంగాలను ముద్రించి దేవాలయాల్లోని పురోహితులు, పండితులు, నగర ప్రముఖులకు, ప్రజలకు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు జుజ్జూరు శేషప్రభాకర్ రావు, ప్రధాన కార్యదర్శి రంగా వెంకటరామకృష్ణ తెలిపారు. పాలకవర్గ సభ్యులు శ్రీరాములు, బచ్చు వెంకటసుబ్బయ్య, రమేష్ కుమార్, బచ్చు లక్ష్మీశ్రీనివాసరావు, కోశాధికారి అచ్యుత నిరంజన్, చుండూరు దామోదర్‌రావు పాల్గొన్నారు.

ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి

నెహ్రూనగర్: నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం చేపట్టే డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్‌ఎస్‌లో ప్రజలు ఇస్తున్న అర్జీల శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్‌లో పీజీఆర్‌ఎస్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి 18 ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో పీజీఆర్‌ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అర్జీలు తీసుకొని అధికారులతో మాట్లాడుతూ పీజీఆర్‌ఎస్‌లో ప్రజలు ఇస్తున్న అర్జీలను సమగ్రంగా పరిష్కారం చేయాలని, ఆయా అర్జీలను ర్యాండమ్‌గా క్షేత్ర స్థాయి పరిశీలన చేస్తామన్నారు. సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌కు 44 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 12, ఇంజినీరింగ్ విభాగానికి 22, రెవెన్యూ విభాగానికి 6, ప్రజారోగ్య విభాగానికి 2, ఉపా సెల్ విభాగానికి 2 చొప్పున ఫిర్యాదులు అందాయని, వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డెప్యూటీ కమిషనర్ సిహెచ్.శ్రీనివాస్, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, డీసీపీ సూరజ్, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, ఉపా సెల్ పీఓ రామారావు, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

నగరంలో రోడ్ల విస్తరణ తప్పనిసరి

గుంటూరు నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి రోడ్ల విస్తరణ, అనధికార ఆక్రమణల తొలగింపు తప్పనిసరి అని, నగర ప్రజలు సహకరించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. సోమవారం నగర కమిషనర్, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి, జీఎంసీ అధికారులతో కలసి టీజేపీఎస్ కాలేజి సెంటర్, కంకరగుంట ఆర్‌యూబీ, బ్రాడీపేట 1వ లైన్ ప్రాంతాల్లో పర్యటించి, ట్రాఫిక్ నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శంకర్ విలాస్ ఆర్‌ఓబీ పనులు త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్ల విస్తరణ చేయాల్సి ఉందని, పది రోజుల్లో ఆర్డీపీలు సిద్ధం చేసి, పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. ట్రాఫిక్ మళ్లింపులో కంకరగుంట ఆర్‌యూబీ చాలా కీలకమని, సదరు ప్రాంతంలో స్థానిక ఎమ్మెల్యే ట్రాఫిక్ పోలీసుల సూచనల మేరకు తీసుకోవాల్సిన పనులకు అనుమతులు మంజూరు చేశామని చెప్పారు. రోడ్ల విస్తరణలో ప్రభావితమయ్యే భవనాలకు నష్ట పరిహారం, స్థలాలకు టీడీఆర్ బాండ్లు అందిస్తామని వెల్లడించారు. ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ శంకర్ విలాస్ ఆర్‌ఓబీ పనులు ప్రారంభానికి ముందే ట్రాఫిక్ డైవర్షన్‌కి ప్రత్యామ్నాయ మార్గాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ రద్దీ ఉండే పలు రోడ్లను గుర్తించామని, ఆయా రోడ్ల విస్తరణ పనులను వేగంగా ప్రారభించాలన్నారు. పర్యటనలో ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, ఈఈ కోటేశ్వరరావు, ఏసిపి రెహ్మాన్, ఎస్ఎస్ సోమశేఖర్, కార్పొరేటర్లు ఈరంటి వరప్రసాద్, అడకా పద్మావతి, అందుగుల సంతోష్ పాల్గొన్నారు.



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

క్లోరిన్ శాంపిల్స్ సేకరించాలి

నెహ్రూ నగర్: నగరంలో వార్డు సచివాలయాల వారీగా తాగునీటి సరఫరా చేసే సమయంలో ప్రతి ఎమినిటి కార్యదర్శి క్లోరిన్ శాంపిల్స్ సేకరించాలని, శాంపిల్స్ రిపోర్ట్ కమిషనర్ చాంబర్‌కి అందించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. నాజ్ సెంటర్‌లోని రిజర్వాయర్‌లో తాగునీటి శాంపిల్స్ పరిశీలించి, క్లోరిన్ శాతాన్ని సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కలుషిత నీటి సరఫరా జరుగుతున్నట్లు గుర్తిస్తే యుద్ధప్రాతిపదికన సమస్య పరిష్కారానికి ఇంజినీరింగ్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. అనంతరం పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించి, అమరావతి రోడ్‌లో ప్రజారోగ్య కార్మికులతో మాట్లాడుతూ ఉదయాన్నే ప్రధాన రోడ్లు శుభ్రం చేసే కార్మికులు తప్పనిసరిగా రేడియం జాకెట్స్ ధరించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. రోడ్లపై, డ్రెయిన్లలో వ్యర్థాలు వేసే కమర్షియల్ సంస్థలను గుర్తించి, భారీ మొత్తంలో అపరాధ రుసుం విధించడం, పునరావృతం అయితే సీజ్ చేయాలని ఆదేశించారు.

అవగాహనతో అనేక వ్యాధులకు చెక్ పెట్టవచ్చు



గుంటూరు మెడికల్: కేవలం అవగాహనతో అనేక వ్యాధులకు చెక్ పెట్టవచ్చని హోప్ విన్ హాస్పిటల్స్ చైర్ ఉమెన్ , చీఫ్ గైనకాలజిస్ట్ డాక్టర్ షమ సుల్తానా అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం పురస్కరించుకుని సోమవారం పుల్లగుంటలోని ప్రియదర్శిని ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ కాలేజీలో 'మానసిక బలం – శారీరక ఆరోగ్యం' అనే అంశంపై అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ చందు రామారావు, ప్రిన్సిపాల్ బి.వి.వి.ఎస్.ఫణికుమార్, డైరెక్టర్ చందు రవికుమార్ పాల్గొన్నారు.